



గుంటూరు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో.. దీపారాధన

కార్తిక దీపాల వెలుగుల్లో శైవక్షేత్రాలు


అమరావతి : క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు


పెదకాకాని : శివాలయంలో దీపారాధనలు చేస్తున్న భక్తులు


గుంటూరు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అమరావతి/పెదకాకాని, గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం రెండవ సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసాయి. మహిళలు, మాలధారులు తెల్లవారు జామునే ఆలయాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాల్లో ప్రదక్షిణలు చేసి.. స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో మహిళలు దీపారాధనలు చేశారు. బాలచాముండికా సమేత అమరేశ్వరాలయానికి.. పంచరామక్షేత్రాల సందర్శన భక్తులు ఆదివారం రాత్రే చేరుకున్నారు. తెల్లవారు జామున పవిత్ర స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం 4 గంట ల నుంచే భక్తులు క్యూలైన్‌లలో బారులు తీరారు.

పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ

పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజామున నుంచే భక్తులు యజ్ఞాల బావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీక మాస దీపారాధనలు చేశారు. మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవా రుసుములు, విరాళాలు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.7 లక్షల ఆదాయం వచ్చినట్లు లీలాకుమార్ తెలిపారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ జాయింట్ ఐజీ కొడాలి పుష్పలత స్వామి వారిని దర్శించుకున్నారు. కార్తిక పౌర్ణమి భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహన పూజలు నిలుపు దల చేసినట్లు తెలిపారు. పౌర్ణమి పర్వదినం కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వ హించను న్నట్లు వెల్లడించారు.

కోటప్పకొండలో భక్తుల కోలాహలం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ చేశారు. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది.




అమరావతి: కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు


పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ



సీసీఐ ఇంకాస్త మెత్తబడాలి

- 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు
- తుఫాన్ వేళ..ఎలా సాధ్యమంటూ రైతుల ఆందోళన
- తేమ శాతం పెంచాలంటూ విజ్ఞప్తి
- కేంద్రం కల్పించిన వెసులు బాటు ప్రస్తావన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్దతు ధర పథకం గైడ్ లెన్స్ చాప్టర్-2 తుఫాన్‌లు తరచుగా సంభవించే అంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు మేలు చేసే అంశాలను ప్రస్తావించింది. ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) నిబంధనలను అసాధారణ పరిస్థితిలో కేంద్ర వ్యవసాయ శాఖ అనుమతి తో మార్చుకునే అవకాశం ఉంది. అది కూడా అసాధారణ పరిస్థితి ఏర్పడిన ప్రాంతం వరకు ఈ మినహాయింపు ఇచ్చే అధికారం కేంద్ర వ్యవసాయ శాఖకు ఉంటుంది. ఈ లెక్కన సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాను తాకిడి ఎక్కువగా ఉండే అంధ్రప్రదేశ్‌లో ఫెయిర్ యావరేజ్ క్వాలిటీలో మొట్ట మొదటిగా చెప్పబడే తేమ శాతాన్ని పెంచి.. కొనుగోలు చేసే అవకాశం స్పష్టంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు తీసుకువస్తున్న పత్తిలో తేమ శాతం 15 నుంచి 20 వరకు ఉంటుందని (మిగతా 7వ పేజీలో)

మొంథా తుఫాన్ వల్ల పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయిన పత్తి రైతులతో సీసీఐ (కాటన్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా) ఆడుకుం టోంది. 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామని పట్టుబడు తోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ ఆరంభించిన కొనుగోలు కేంద్రాల్లో భారీగా గొడ వలు జరుగుతున్నాయి. వాతావరణం అంతా తేమతో ఉంటే పత్తి పొడిగా ఎలా ఉంటుంది..? అంటూ రైతులు బయ్యర్లతో వాగ్వివాదానికి దిగు తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితిని బట్టి ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) నిబంధనలు మార్చుకోవచ్చు అన్న కేంద్ర క్యాబినెట్ ఉత్తర్వులపై చర్చ ఆరంభమైంది. 2014 మేలో కేంద్రం విడుదల చేసిన మద్దతు ధర పథకం (ప్రైస్ సపోర్టు స్కీం, పీఎస్ఎస్) గైడ్ లెన్స్‌ను కొందరు ప్రస్తావిస్తున్నారు.

ఇదేమి చోద్యం!

- శిక్షణలో ఉద్యోగోన్నతి పొందిన ఎంపీడీఓలు
- వారి డిజిటల్ సిగ్నేచర్‌తో 'ఉపాధి' బిల్లులు అప్‌లోడ్
- నిబంధనలకు విరుద్ధమైనా.. పట్టించుకునేవారేరీ ?
- ఏడు మండలాల్లో.. రూ.8.66 కోట్లు..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం బిల్లుల ప్రక్రియలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. మెటీరియల్ బిల్లుల అంశంలో కొందరు అధికారులు నిబంధనలను తుంగ లో తొక్కారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బిల్లులను అప్‌లోడ్ చేయడంలో శిక్షణలో ఉన్న మండల ప్రజా పరిషత్ అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఏడు మండలాల్లో రూ.8.66 కోట్ల విలువైన బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది.

శిక్షణలో ఉండగానే... బిల్లులు అప్‌లోడ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన 16 మంది విధుల నిర్వహణపై బాపట్లలోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సదరు అధికారుల స్థానంలో పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల నుంచి ఇన్‌చార్జిల (ఎఫ్ఏసీ)ను నియమించారు. ఎంపీడీవోలు పని చేస్తున్న చోట నుంచి రిలీవ్ అయి శిక్షణకు హాజరయ్యారు. వీరు శిక్షణలో ఉండగానే అయా మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి మెటీరియల్ బిల్లులను అప్‌లోడ్ చేశారు. డీఎస్(డిజిల్ సిగ్నేచర్) వారి వద్ద ఉన్నా దానిని శిక్షణ కాలంలో వినియోగించరాదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు డీఎస్‌లను వినియోగించి బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఉపాధి పనుల్లో బిల్లుల అక్రమాలపై మండలాల వారీగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరు గుతోంది. బిల్లుల ప్రక్రియలో నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలన్న వాదన వినిపిస్తోంది. ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న డ్వామా ఉన్నతాధికారులు శిక్షణ కాలంలో ఏ మండలంలో ఎంత మేర బిల్లులు ప్రక్రియ పూర్తి చేశారన్న అంశంపై దృష్టి సారిస్తే జరిగిన అవకత వకలు వెలుగుచూసే అవకాశం ఉంది.


సీసీ రోడ్డు నిర్మాణం (పాత చిత్రం)


బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఉమామహేశ్వర్

నిర్దిష్ట గడువులోగా అర్జీలకు పరిష్కారం

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ఎస్పీకి సమస్యలు విన్నవించుకున్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మహిళలు, వృద్ధుల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలపై నివేదికను పోలీసు కార్యాలయానికి పంపాలన్నారు. భూ వివాదాలు, ఆస్తిత గాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు వంటి పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 83 మంది అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్‌సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభం కాకముందే పగుళ్ళు


ప్రశ్నార్థకంగా మారిన జాతీయ రహదారి నాణ్యత

కారంచేడు - పర్చూరు మధ్య రోడ్డు ఇలా



పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి (167ఏ) నాణ్యత ప్రశ్నార్థకమైంది. పనులు పూర్తి కాకుండానే పగుళ్లిస్తోంది. పర్చూరు - కారంచేడు మధ్య వాగు అంచున రోడ్డు కుంగిపోయింది. ఈ పగుళ్ల కప్పిపుచ్చేందుకు గుత్తేదారు క్రషర్ డస్టు వేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దాదాపు రూ.850 కోట్లతో నిర్మిస్తున్న రహదారి కనీసం ప్రారంభోత్సవం జరగక ముందే పగుళ్ల ఇవ్వడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో పర్చూరు పర్యటనకొచ్చిన రాష్ట్ర మంత్రులు సైతం రోడ్డు నాణ్యతపై పెదవివిరిచారు. పర్చూరు - కారంచేడు సమీపం వరకు వాగు అంచున రివిట్‌మెంట్ చేయకపోవడం వల్లే రోడ్డు పగుళ్లిచ్చి ఉంటుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. సర్వీసు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల తిమ్మరాజుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఇందుకు నిదర్శనం. రోడ్డుకు అంచుల్లో ఎక్కడా డ్రెయినేజ్‌ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో పొలాలు వరద ముంపునకు గురికావడమే కాకుండా.. రహదారి నిర్మాణం దెబ్బతింది. పటిష్టమైన రివిట్‌తో కూడిన డ్రెయిన్ ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా సూచనలు చేశారు.


పగుళ్ళ ప్రాంతంలో దస్టుతో సరిపెట్టిన వైనం


ఘటనా స్థలంలో కంటైనర్, కారు

నిశీధిలో మృత్యుఘోష

- నలుగురు మృత్యువాత.. అందరూ బంధువులే
- గాయాలతో బయటపడిన ఇద్దరు చిన్నారులు
- ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా కర్లపాలెం వద్ద దుర్ఘటన

లారీని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన కారు


శ్రీనివాసరాజు బేతాళం లక్ష్మీ బలరామరాజు పుష్పవతి

కర్లపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాపట్లలోని బంధువుల శుభకార్యానికి వెళ్లిన కుటుంబం తిరుగు ప్రయాణం తిరిగి రాని లోకాలకు సాగింది. నిశీధిలో ఎదురుగా కంటైనర్ రూపంలో వచ్చిన మృత్యువు నలుగురిని కబళించింది. ఈ దుర్ఘటనలో కారులో నలుగురు పెద్దలు మృతి చెందగా.. ఇద్దరు చిన్నారులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పంచాయతీలోని సత్యవతిపేట జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాద స్థలం వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కర్లపాలెంలోని సినిమా హాలు వెనుక బజారులో నివాసం ఉంటున్న బేతాళం బలరామరాజు, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల శుభకార్యానికి బాపట్ల వెళ్లారు. ఫంక్షన్‌లో ఆనందంగా గడిపి ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి మూడు కార్లల్లో తిరుగు ప్రయాణమయ్యారు. బలరామరాజు, లక్ష్మీ ప్రయాణిస్తున్న కారులో వారి చిన్న కుమార్తె (మిగతా 7వ పేజీలో)

నలుగురూ బంధువులే..

బేతాళం బలరామరాజు, లక్ష్మీలది వ్యవసాయ కుటుంబం. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె వాణి, భర్త వేణు, మనవరాళ్ల భావన, దీపికలు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. చిన్నకుమార్తె గాదెరాజు మాధవి, భర్త అనీల్‌కుమార్ వర్మ పైలెట్‌గా ఉద్యోగం చేస్తూ ఉదయపూర్‌లో ఉంటున్నారు. గాదెరాజు పుష్పవతి బలరామరాజుకు వియ్యపురాలు. చిన్నకుమార్తెను పుష్పవతి కుమారుడికి ఇచ్చి వివాహం చేశారు. ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు పుష్పవతి కోడలు మాధవి, మనవడు జయంత్, మనవరాలు వైష్ణవిలను తీసుకొని గన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి ముదునూరి శ్రీనివాసరాజు కారులో నేరుగా బాపట్లకు వెళ్లారు. విజయవాడకు చెందిన శ్రీనివాసరాజుకు ఒక్కడే కుమారుడు. అతనికి ఈ నెల 26న వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి, అంత్యక్రియలను దగ్గరుండి చూసుకున్నారు.


సూర్యలంక సముద్రతీరంలో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తదితరులు

సూర్యలంకలో..
కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు

పరిశీలించిన ఆర్డీవో, అధికారుల బృందం

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిరోజు పుణ్యస్నానాలు ఆచరించటానికి సూర్యలంక సముద్రతీరానికి విచ్చేసే భక్తులకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం షవర్‌బాత్‌లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, మొబైల్ టాయిలెట్స్ అదనపు లైటింగ్ సౌకర్యాలు వేగవంతంగా ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం నాటికి వసతులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ సిబ్బందితో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్తీకమాసం ప్రారంభం నుంచి ఈ ఏడాది వర్షాలు, తుఫాన్ వంటి విపత్తులు సంభవించటంతో మంగళవారం వరకు బీచ్ లో రాకపోకలు నిషేధించారు. కార్తీక పౌర్ణమి రోజు భక్తులను అనుమతించాలని ఆలోచనతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. తుఫాన్ కారణంగా పార్కింగ్ ఏరియాలో పెద్దఎత్తున నిలిచిపోయిన వర్షపునీటిని బయటకు తరలించే ఏర్పాటు చేశారు. ప్రకృతి అనుకూలిస్తే పౌర్ణమి రోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా అన్నివసతులు సమకూర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది కలిసి మొబైల్ టాయిలెట్‌లు, తాత్కాలిక స్నానాల గదులు ఏర్పాట్లు చేయించారు.

గుంటూరులో.. సాయి భక్తులు లేరా?



ఏటా ప్యాసింజర్ రెవెన్యూ రూపంలో రైల్వేకు రూ. 110 కోట్ల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్నా గుంటూరు రైల్వే డివిజన్‌కు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. గుంటూరు రైల్వే డివిజన్ ఏర్పడి దాదాపుగా రెండు దశాబ్దాలు గడిచి హెడ్‌క్వార్టర్‌గా గుంటూరు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో గుర్తింపు ఇవ్వని పరిస్థితి. గతంలో ప్రత్యేక రైళ్లు అనగానే అన్ని వేరే మార్గాల్లో మంజూరు చేసేవారు. ఇప్పుడు గుంటూరు మీదగా నడుపుతున్నా కొన్నింటికి హెడ్‌క్వార్టర్స్ అయిన గుంటూరు జంక్షన్‌లో హాల్టింగ్ కల్పించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

- సత్యసాయి ఉత్సవాల ప్రత్యేక రైళ్లకు ఇక్కడ నో స్టాపేజీ
- రూ. 110 కోట్ల ఆదాయం ఇస్తున్నా డివిజన్‌పై చిన్నచూపు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా అనేక ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నడపబోతున్నది. సత్యసాయి బాబా భక్తులు గుంటూరు జిల్లాలో అనేక మంది ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా ప్రత్యేక రైళ్లకు ఇక్కడ స్టాపేజీ ఇవ్వకపోవడాన్ని సోమవారం పలువురు రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లారు.

నంబరు. 08335/08336 సంబల్‌పూర్ - బెంగళూరు కంటోన్మెంట్ - సంబల్‌పూర్ ప్రత్యేక రైళ్లు ఈ నెల 20, 24 తేదీల్లో గుంటూరు మీదగా ప్రయాణించనున్నాయి. అలానే నంబరు. 08445/08446 కటక్ - బెంగళూరు కంటోన్మెంట్ - కటక్ ప్రత్యేక రైళ్లు ఈ నెల 21, 25 తేదీల్లో, నంబరు. 08463/08464 భువనేశ్వర్ - బెంగళూరు కంటోన్మెంట్ - బెంగళూరు రైళ్లు ఈ నెల 16, 20 తేదీల్లో, నంబరు. 08553/08554 శ్రీకాకుళం రోడ్డు - బెంగళూరు కంటోన్మెంట్ - శ్రీకాకుళం రోడ్డు రైళ్లు ఈ నెల 21, 24 తేదీల్లో గుంటూరు మీదగా ప్రయాణించనున్నాయి. అయితే ఈ ఎనిమిది రైళ్లకు ఈస్టు కోస్టు రైల్వే జోన్ గుంటూరులో నిలుపుదల ఇవ్వలేదు.

ఎన్ఎస్‌జీ-2 కేటగిరీలో ఉన్నప్పటికీ....

నాన్ సబర్బన్ గ్రూపు-2 కేటగిరీలో గుంటూరు రైల్వేస్టేషన్ ఉన్నది. ఈ ప్రత్యేక రైళ్లు గుంటూరు - నంద్యాల మార్గంలో ప్రయాణిస్తాయి. ఈ మార్గంలో కొంత భాగం మినహా అంతా డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ సదుపాయాన్ని కలిగివుంది. అయినప్పటికీ గుంటూరు లాంటి మేజర్ రైల్వే జంక్షన్‌లో నిలుపుదల కల్పించకుండా టైంటేబుల్‌ని ఈస్టు కోస్టు రైల్వే విడుదల చేసింది. దీనికి ఇక్కడి నుంచి అభ్యంతరం పెట్టకపోవడం ఏమిటని రైల్వే వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. గుంటూరు కంటే తక్కువ కేటగిరీ స్టేషన్లుగా ఎన్ఎస్‌జీ-4లో ఉన్న గుత్తి, ధర్మవరానికి హాల్టింగ్ సదుపాయం కల్పించి ఇక్కడ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎనిమిది రైళ్లకు గుంటూరుతో పాటు మార్కాపురం రోడ్డులోనూ స్టాపేజీ కల్పించాలని ఈ-మెయిల్స్ పంపించారు. దీనిపై ఈస్టుకోస్టు రైల్వే ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

శిథిలావస్థలో.. సీటీ శాఖ కార్యాలయం

నిలిచిన నిర్మాణ పనులు

చుట్టుగుంట సెంటర్‌లో నిర్మాణ దశలో ఉన్న వాణిజ్యపన్నులశాఖ (సీటీ శాఖ) కార్యాలయ భవన నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. ఈ భవ న నిర్మాణం పూర్తయితే తమ కష్టాలు తీరుతాయనుకున్న ఆ శాఖ ఉద్యోగుల ఆశలు అడి ఆశలయ్యాయి. భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవటంతో పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటోంది. ఈ నిర్మాణం పూర్తయితే రూ లక్షల నిధులు ప్రభుత్వానికి ఆదా అయ్యేది. వైసీపీ ప్రభుత్వం రాకతో భవన నిర్మాణం అటకెక్కింది.

గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నుల శాఖ గుంటూరు-1, 2 డివిజన్‌లు ప్రస్తుతం గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని వసుంధర కాంప్లెక్స్ భవనంలో ఉన్నాయి. దశాబ్ధకాలం పై నుంచి అక్కడే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. డివిజన్ కార్యాలయాలతోపాటు పలు సర్కిల్స్ కార్యాలయాలు కూడా ఉన్నాయి. తద్వారా నెల నెలా రూ. లక్షలు అద్దె రూపంలో సదరు భవన యజమానులకు చెల్లిస్తున్నారు. వర్షం పడిందంటే చాలు భవనం సెల్లార్‌లో వరద నీటితో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. తరచూ లిఫ్ట్ రిపేర్లతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గతంలో 2018లో సీటీ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా రాజాబాబు (ప్రస్తుతం ప్రకాశం కలెక్టర్), అప్పట్లో మంత్రిగా వ్యవహరించిన ప్రత్తిపాటి పుల్లారావు ఇతర ఎమ్మెల్యేల చొరవతో చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెటింగ్‌శాఖ స్థలంలో వారి నిధులతో సీటీ శాఖకు భవనం నిర్మించటం, అద్దె రూపంలో మార్కెటింగ్‌శాఖకు చెల్లించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకు అనుగుణంగా నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని కూడా ప్రారంభించారు. ఆ తరువాత నిర్మాణ దశలో ఉన్న భవనం కొంత భాగం పూర్తయింది. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రహణం పట్టినట్లయింది. అనంతరం సీటీ శాఖ గుంటూరు జాయింట్ కమిషనర్‌గా వ్యవహరించిన ఓంకార్‌రెడ్డి సదరు భవన నిర్మాణ పనులపై అప్పటి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. నిర్మాణానికి నిధులివ్వక, కాంట్రాక్టర్‌లు ముందుకు రాక సగ భాగం నిర్మాణ నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది.


శిథిలావస్థకు చేరుకున్న సీటీ శాఖ కార్యాలయం

● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు.....

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తీసుకొచ్చే శాఖల్లో వాణిజ్యపన్నులశాఖ ఎంతో కీలకమైనది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే సీటీ శాఖకు సొంత కార్యాలయ భవనం లేకపోవటంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దెలకు రూ. లక్షలు చెల్లిస్తూ ఖజానాకు గండి పడుతున్నా ఉన్నతాధికారులు సొంత భవనం నిర్మాణ దిశగా ఆలోచన చేయకపోవటం సరికాదని ఉద్యోగులు వాదిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకిరావటంతో సీటీ శాఖ ఉద్యోగులు సొంత భవనంపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు సీటీ శాఖ సొంత భవనం నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏఎన్‌యూలో శిల్పాధికారంపై ప్రత్యేక సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నృత్య విభాగం ఆధ్వర్యంలో శిల్పాధికారం అనే అంశంపై సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా తమిళనాడులోని తిరువల్లూరు విశ్వవిద్యాలయం, వెల్లూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.రూప పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, శిల్పాధికారం తమిళ సాహిత్యంలో ఉన్న ప్రాధాన్యాన్ని ఆధునిక విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. వ్యక్తిత్వ నిర్మాణంలో శిల్పాధికారం అనే భావనను ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు. ఆర్ట్స్ కళల కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ, భాషల మధ్య సమన్వయం అవసరమని అన్నారు. ఇలాంటి వర్క్‌షాపులు విద్యార్థుల అవగాహనను పెంపొందిస్తాయన్నారు. ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ, శిల్పాధికారం తమిళ సాహిత్యంలో వేదానికి సమానమైన విలువ కలిగిందన్నారు. కార్యక్రమంలో తెలుగు, ప్రాచ్య భాషల విభాగం అతిథి అధ్యాపకుడు పవన్, వాసు, థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతి నాగభూషణం, మట్టుపల్లి కాశయ్య పాల్గొన్నారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.


దీక్షిత్ శెట్టి

కలెక్టరేట్‌లో పురుగు మందు తాగిన రైతు

● తన భూమి ఆక్రమించారంటూ ఆవేదన



పురుగుమందు తాగి పడిపోయిన బాధితుడు

బాపట్ల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన గంజాం మండలం మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీకు చెందిన మార్పు బెన్ను సోమవారం కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. 1981లో 22 కుటుంబాలకు 56 ఎకరాల భూమిని సర్వే నంబరు 1158లో ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న రైతులు.. ఏడేళ్ల క్రితం ఆ ప్రాంతానికి చెందిన మన్నె సునీల్‌చౌదరి, మన్నె రాధికకు కౌలుకు భూములిచ్చారు. వారు కౌలు సరిగ్గా ఇవ్వకపోగా సర్వే నంబరు 1159గా మార్చి.. విద్యుత్ సర్వీస్ వారి పేరు మీద ఏర్పాటు చేసుకున్నారని బాధితుడు ఆరోపించాడు. చినగంజాం పోలీసులకు, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదంటూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఆయన కలెక్టరేట్ వద్ద పురుగు మందు తాగాడు. దీంతో అక్కడ ఉన్నవారు అతనిని ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలందిస్తున్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

విజయపురిసౌత్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్‌తండాలో ఓ ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు. నాటుసారాను నిల్వ ఉంచిన బాలునాయక్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 15 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎస్ఐ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

'ఎస్ఆర్ఎం'లో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్

- వాంతులు, విరోచనాలతో ఎన్నారైలో విద్యార్థులు
- ఒకరి పరిస్థితి విషమం?
- నెల క్రితం ఇదే ఇబ్బందితో విద్యార్థుల ధర్నా
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు కరువు

తుళ్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హాస్టల్‌లోని విద్యార్థులకు సోమవారం ఫుడ్ పాయిజన్ జరిగింది. ఆదివారం హాస్టల్ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. మరుసటి రోజు ఉదయం నుంచే వాంతులు, విరోచనాలతో బాధపడ్డారు. యాజమాన్య సిబ్బంది వారిని ఎన్నారై హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఒక విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. అయితే ఈ విషయాన్ని బయటకు రానివ్వొద్దంటూ విద్యార్థులను యాజమాన్యం బెదిరింపు ధోరణితో హెచ్చరించడం గమనార్హం. ఇన్‌స్టాగ్రాంలో విద్యార్థులు కొంతమంది ఈ ఘటనపై పోస్టు చేయడంతో వారిమీద యాజమాన్యం దౌర్జన్యం చేసి, వెంటనే పోస్టులను డిలీట్ చేయించారని తెలిసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు.. రూ.లక్షలు ఫీజులు కట్టి పిల్లల ఆరోగ్యం దెబ్బతీయడానికా.. యూనివర్సిటీలో చేర్పించామా.. అంటూ ఫోన్‌లో, డైరెక్టుగా యాజమాన్య సిబ్బంది దగ్గరకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చదువు సంగతి దేవుడెరుగు పిల్లలు చేతికందకుండా పోతారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెల క్రితమే ఆందోళన..

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నెల క్రితం విద్యార్థులకు ఇదే విధంగా ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. దీనిని అత్యంత గోప్యంగా ఉంచారు. అప్పట్లో విద్యార్థులు లోపల ధర్నా కూడా చేశారు. అయినా అపరిశుభ్రంగా ఆహార పదార్థాలు తయారు చేయడంతో.. ఇప్పుడు 200 మందికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. హాస్టల్‌కు సంవత్సరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.80లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇంత డబ్బులు తీసుకొని కూడా పరిశుభ్రమైన ఆహారం పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే టీసీలు ఇచ్చి పంపండని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేసినట్లు తెలిసింది.

ఫుడ్ తనిఖీ అధికారుల జాడేది!

వేల మంది విద్యార్థులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో చదును అభ్యసిస్తున్నారు. అందులో చాలామంది లోపల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. అంతమంది వంట చేస్తున్న క్యాంటీన్‌ను ఎప్పుడూ ఐదేళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఆహార పదార్థాల నాణ్యతా గురించి ఏ ఒక్కరోజు పట్టించుకోలేదు. తరచూ తనిఖీలు జరుగుతుంటే.. ఇటువంటి దారుణమైన పరిస్థితి ఏర్పడేది కాదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వర్సిటీ మామూళ్ల మత్తులో తనిఖీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మొంథాను సమర్థంగా ఎదుర్కొన్నాం

- సమష్టి కృషి వల్లే సాధ్యమైంది
- తుఫాన్ సేవల సత్కార సభలో కలెక్టర్ కృతికా శుక్లా



ఆర్డీవో మధులతను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అధికారులంతా ఒక్కటై మొంథా తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కోగలిగామని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ఇది సమష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు. ఇదే విధంగా రానున్న కాలంలో ఎలాంటి విపత్తు వచ్చినా కలిసికట్టుగా నిలబడగలగాలని.. అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. తుఫాన్ విధులను సమర్థంగా నిర్వహించిన సిబ్బంది, అధికారులకు అభినందన సభ సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ మెమెంటో, శాలువాతో ఘనంగా 51 మంది అధికారులు, సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమర్థ సేవలందించిన అధికారులను ఎల్లప్పుడూ గుర్తుంచుకునేలా.. అన్ని వివరాలను తయారు చేయాలని, దీనిని కలెక్టర్ ఆఫీస్‌లో ఉండేలా ఒక గుర్తుగా, అందరినీ యూనిటీగా చేసేలా ఉంచుతామన్నారు. పని చేసిన అందరిని ఒకేలా చూసామని, ఇంకొంచెం ఎక్కువగా పని చేసిన వారిని గుర్తించి ఈ సత్కారమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ గుర్తింపు రావడం ద్వారా ఇంకో పనిని ప్రోత్సహించడమే అవుతుందని కృతికా శుక్లా స్పష్టం చేశారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొంథా లాంటి తుఫాన్‌లను సమర్థంగా ఎదుర్కొనే అధికారులు, సిబ్బంది పుష్కలంగా ఉన్నారని కొనియాడారు. ఒక్కటిగా తుఫాను బీభత్సాన్ని ఎదుర్కోవడంలో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో పని చేశామని, అందరికీ అభినందనలు తెలిపారు. ఆర్డీవోలు కె.మధులత, వి.మురళీకృష్ణ, జీవీ రమాకాంత్, డీపీవో ఎన్‌వీ నాగేశ్వరనాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ కుంభా ముత్తయ్య, జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.గీతారాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయకుమార్, మున్సిపల్ కమిషనర్లు సి.శ్రీహరిబాబు, ఎం.జస్వంత్, ఎం.సుభాష్ చంద్రబోస్, డి.వేణుబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు, ఎస్‌బీ సీఐ పి.శరత్‌బాబు, బెల్లంకొండ ఎస్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్స్ అల్లూరి చినపుల్లయ్య, ఎం.మల్లికార్జునరావుతో పాటు వివిధ శాఖలకు చెందిన వారిని సత్కరించారు. జేసీ సూరజ్ ధనుంజయ్ డీఆర్‌ఓ ఏకా మురళి పాల్గొన్నారు.

మెడికోలు ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

● వెస్ట్ జోన్ డీఎస్పీ అరవింద్



డీఎస్పీ అరవింద్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వెస్ట్ జోన్ డీఎస్పీ కె.అరవింద్ హితవు పలికారు. సోమవారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో ర్యాగింగ్ దుష్ఫలితాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ జరిగితే వెంటనే ప్రిన్సిపాల్‌కు, పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్‌లో పాల్గొనే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వైద్య విద్యార్థులు చదువుపై ధ్యాస ఉంచి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి మాట్లాడుడుతూ ర్యాగింగ్‌కు పాల్పడటం దుష్ట సంప్రదాయమని, ఇది అనాగరిక చర్య అని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కొన్ని సార్లు మెడికల్ కాలేజీ నుంచి బహిష్కరణకు కూడా గురవుతారని చెప్పారు. ఈ సందర్భంగా జీఎంసీ తరఫున డీఎస్పీ అరవింద్‌ను ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ ఇంకాస్త 'మెత్తబడాలి'!

(5వ పేజీ తరువాయి)

సీసీఐ బయ్యర్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల రైతులు పత్తిని ఎంత ఆరబెట్టినా అదే తేమ శాతం నమోదు కావడం గమనించదగిన అంశం. ఈ పరిస్థితుల్లో తేమ శాతాన్ని 12 నుంచి 20కి పెంచాలని రైతులు కోరుతున్నారు. ఈ మాత్రం వెసులుబాటు ఇవ్వకపోతే తాము పూర్తిగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.


పని చేయని కిసాన్ యాప్

సీసీఐ అందుబాటులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ సరిగా పని చేయక పోవడం రైతులకు శాపంగా మారింది. స్లాట్ బుక్ చేసుకోవడం గగనం అయిపోతుందని రైతులు చెబుతున్నారు. సీసీఐ అధికారులు మాత్రం అదే యాప్ ను వాడాలని చెబుతున్నారు.

జీవో నంబరు 843కి తిలోదకాలు

రాష్ట్రంలోని పత్తి రైతులకు మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 843కి సీసీఐ తిలోదకాలు ఇచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ జీవోలని 23వ నిబంధన ప్రకారం రైతు పత్తిని ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు ఉంది. సీసీఐ మాత్రం అందుకు ఒప్పుకోవ డం లేదు. ఏ జిల్లా రైతులు అదే జిల్లాలో, ఏ మండలం రైతులు అదే మం డలంలో పత్తిని విక్రాయించాలని సూచిస్తోంది. జీఓను కూడా గుంటూరు లోని సీసీఐ జనరల్ మేనేజర్ పక్కన పెట్టడం దుమారం రేపుతోంది.

సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు మూసివేత




మూసివేసిన సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు

విజయపురిసౌత్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు క్రస్ట్‌గేట్లను మూసివేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,292, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 41,915 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 41,915 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

33 వేల క్యూసెక్కుల వరద

రెంటచింతల,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలోనిలోని సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 1.5 మీటర్లు, ఒక గేట్ మీటర్ మేర ఎత్తి 32,162, టేల్ రేస్ ఛానల్ ద్వారా 4,422, మొత్తంగా 36,584 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.4939 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందని తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ దిగువకు.. 53,400 క్యూసెక్కులు



బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 53,581 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతోంది. 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేశారు.

పులిచింతలలో 42.86 టీఎంసీలు

అచ్చంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.86 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 35,360 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మొత్తం 17 వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

పిన్నెల్లి సోదరుల.. ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జంట హత్యల కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డి సుప్రీంకోర్టులో దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలో పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిపై తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. హైకోర్టు తీర్పును ఆగస్టు 31న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, విచారణను ధర్మాసనం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

రేషన్ బియ్యం ఆటో బోల్తా.. ఒకరి మృతి

● పలువురికి గాయాలు

నాదెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటో బోల్తా కొట్టిన ఘటన మండలంలోని నాదెండ్ల గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనలో బబూన్ మాలిక్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. ఫిరంగిపురం నుంచి ట్రాలీ ఆటోలో సుమారు 35 బస్తాల బియ్యాన్ని చిలకలూరిపేటకు తరలిస్తున్నారు. నాదెండ్ల గ్రామం దాటిన తరువాత జాలాది సుబ్బయ్య కుంట వద్దకు రాగానే ఆటో టైరు పంక్చరైంది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. ప్రభాత్ మాలిక్, దైదారి మాలిక్, భీమా సేన్ దాసు, సర్వేశ్వర మాలిక్‌తో పాటు మరొకరు గాయపడ్డారు. వీరిలో కొందరిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఎస్ఐ పుల్లారావు ఘటనా స్థలానికి చేరుకొని ఆటోతో పాటు బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసుకున్నారు.

ఆటోలో నుంచి జారిపడి రెంటాల వాసి మృతి

రెంటచింతల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి జారిపడి మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన పల్లా లక్ష్మయ్య(67) అనే వ్యక్తి మృతిన చెందిన ఘటన సోమవారం జరిగింది. వివరాల మేరకు.. మిర్యాలగూడ నుంచి వస్తున్న లక్ష్మయ్య లక్ష్మీపురం వద్దకు రాగానే ఆటోలో నుంచి జారీ పడ్డాడు. క్షతగాత్రుడ్ని గురజాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతనికి భార్య సీతారావమ్మ, నలుగురు సంతానం. కుమారుడు రామకృష్ణ పాలువాయి వీఆర్వోగా పనిచేస్తున్నారు. లక్ష్మయ్య మృతి పట్ల తహసీల్దారు మేరి కనకం, రాష్ట్ర వీఆర్వోల సంఘ నేత రాజశేఖర్ తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.

జ్వరాలపై.. ఇంటింటి సర్వే

సత్తెనపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తరువాత జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్త మైంది. ముందుగానే జ్వరాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించేలా ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఫీవర్ సర్వేను చేపట్టింది. ఆరోగ్య శాఖకు చెందిన ఆశా కార్యకర్త, ఏఎన్ఎం గ్రామాల్లో గృహాలకు వెళ్లి సర్వే చేస్తున్నారు. జ్వరాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. జ్వర లక్షణాలు ఉంటే హెల్త్ యాప్‌లోని సిండోమిక్ ఫాంలో వివరాలను ఏఎన్ఎం అప్‌లోడ్ చేస్తారు. ఒకే ప్రాంతం నుంచి ఐదు జ్వరాల కేసులు నమోదైతే రాష్ట్ర స్థాయి ఆరోగ్య శాఖ అధికారులకు, స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం అందుతుంది. ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు ఆదేశాలు అందాయి. ఆరోగ్య కేంద్రాలకు జ్వరాలతో వచ్చే రోగుల వివరాలను పీ ఫామ్, ఎల్ ఫాంలలో నమోదు చేస్తారు. జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోనున్నారు.

నిశీధిలో మృత్యుఘోష

(5వ పేజీ తరువాయి)

అత్తయ్య, వియ్యపురాలు గాదె రాజు పుష్పవతి(60), మనవడు జయంత్, మనవరాలు వైష్ణవి, బంధువు ముదునూరి శ్రీనివాసరాజు (57) ఉన్నారు. శ్రీనివాసరాజు కారు డ్రైవింగ్ చేస్తున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో కర్లపాలెం పంచాయతీ సత్యవతిపేట వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయి వారి కారు ఎదురుగా వస్తున్న రొయ్యల కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బలరామరాజు, లక్ష్మి, పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసరాజు కొన ఊపిరితో హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందారు. చిన్నారి వైష్ణవికి కుడి భుజానికి గాయాలు కాగా చీరాలలోని ప్రైవేట్ వైద్యశాలకు, జయంత్ తల, కాళ్లకు గాయాలు కాగా గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన మూడు నిమిషాల్లోనే మిగిలిన రెండు కార్లు ఘటనా స్థలానికి చేరుకోవడ ంతో.. బంధువులు బోరున విలపిస్తూ మృతదేహాలను వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై సీఐ హరికృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

37,640 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు సోమవారం 40,415 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,640 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,834 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12700
334	10000	15000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15200
273	----	---	నెంబరు. 5	10000	14300
341	10000	15800	273	---	----
4884	---	----	341	10000	16000
సూపర్ 10	----	---	4884	11000	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15200	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

స్నూకర్ పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు ఐదుగురు

● నేడు ఫైనల్ పోటీలు



క్వార్టర్ ఫైనల్‌లో క్రీడాకారుడు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు తుది దశకు చేరుకునే సమయానికి క్రీడాకారులు విజయం కోసం హోరాహోరీగా తలపడుతున్నారు. ఉత్కంఠ భరితంగా సాగుతున్న స్నూకర్ పోటీల్లో ఐదుగురు క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ క్రీడాకారులు ఎస్.శంకర్రావు, స్వామి, యోగి, కల్యాణ వర్మ, సాగర్ జైన్, పండరీ కిషోర్ స్నూకర్ క్వార్టర్స్ చేరారని పోటీల నిర్వాహక కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు(అజార్) తెలిపారు. ఈ పోటీల్లో పండరి కిషోర్, సోమేశ్వరావుపై 4-3, అనంత్, శుకూరుపై 4-3, స్వామి, హేమంత్‌పై 4- 2 స్కోర్‌తో గెలుపొందారని ఆయన వెల్లడించారు.

రెండుకిలోల గంజాయి స్వాధీనం

బాపట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు సోమవారం పోలీసు అధికారులు పూరీ-తిరుపతి రైలులో సోదాలు నిర్వహించారు. రెండు కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌బీ సీఐ ఎం.రాంబాబు తెలిపారు. పోలీసు అధికారులు, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్, ఈగల్ సెల్ సిబ్బంది జాయింట్ ఆపరేషన్‌తో సోదాలు నిర్వహించారు. బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్ల మధ్య తనిఖీలు నిర్వహించి పోలీసు జాగీలాలతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



డ్రైయినేజిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలి : కమిషనర్

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. ప్రధాన రహదార్లతో పాటు అంతర్గత రోడ్లు, డ్రైనేజిలను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని శానిటరి సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ప్రతివార్డులో శుభ్రతను నిరంతరంగా పర్యవేక్షించాలని, ప్రజలకు నిరవధికంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 25వ వార్డు విజయలక్ష్మీపురం టీ పాయింట్ పక్కనే డ్రైనేజి పూడికతీత పనులను పర్యవేక్షించారు. పనులు వేగవంతంగా చేయాలని శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణకు సూచించారు. వివేకానందకాలనీ పార్క్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, సుందరీకరణ పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. సాధ్యమైన తొందరగా పనులు పూర్తి చేయాలని చెప్పారు.

రామలింగేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

● మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : శ్రీరామలింగేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీగంగా పార్వతి వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో సోమవారం అన్నంసతీష్ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. శివలింగానికి క్షీరాభిషేకం చేసి అక్కడ ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో భక్తులకు వడ్డించారు. దేవస్థానం కమిటీ సభ్యుల భక్తుల సహకారంతో నూరువసంతాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించటం సంతోషదాయకమన్నారు. స్వామివారి సేవలో తనవంతు సేవ చేయటానికి 5 రోజులు జరిగే పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. శివుని ఆశీస్సులతో సేవ చేసుకునే అదృష్టం వచ్చిందన్నారు. అందరి సహకారంతో వేడుకను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



భక్తులకు అన్న ప్రసాద వితరణలో వడ్డిస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ అధ్యాపకుడికి డాక్టరేట్



సుధీర్‌చౌదరి

బాపట్లరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ అధ్యాపకుడు బి.సుధీర్‌చౌదరి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాకో ఇపిడిమోలాజి అండ్ ఫార్మాకో ఎకనామిక్ స్టడీ ఆఫ్ హైపర్ టెన్సివ్ డయాబెటిక్ పెషెంట్స్ ఇన్ ది రూరల్ ఏరియాస్ ఆఫ్ అమరావతి అనే దాని మీద పీహెచ్‌డీ డిగ్రీ పొందారని తెలిపారు. డాక్టర్ మయాశర్మ గైడ్‌గా, ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో పిఎసిఐఎఫ్ఐసి యూనివర్సిటి రాజస్థాన్ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారని తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సుధీర్‌కు అభినందనలు తెలిపారు.

డాక్టర్ మోర్లకు సర్దార్ వల్లబాయ్‌పటేల్ మెమోరియల్ అవార్డు



డాక్టర్ మోర్ల శ్రీనివాసరావు

పిట్టలవానిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావుకు ఆయన చేసిన సేవలకు గాను అంతర్జాతీయ మనం ఫౌండేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి పర్యవేక్షణలో సర్దార్ వల్లబాయ్‌పటేల్ మెమోరియల్ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. గత 16 సంవత్సరాలుగా గ్రంథాలయశాఖపరంగా విద్యార్థిని, విద్యార్థులకు వివిధ రంగాలలో అభివృద్ధి చెందేవిధంగా సేవలందించినందుకుగాను ఈ అవార్డు లభించినట్లు చెప్పారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన డాక్టర్ చక్రవర్తికి గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, గ్రంథాలయ పాఠకులు మోర్ల శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : సీఐ



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టణ సీఐ రాంబాబు, ఎస్సైలు చంద్రావతి, విజయ్‌కుమార్

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. పోలీసుస్టేషన్ ఆవరణలో సోమవారం యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపటం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే నష్టాలు గురించి అవగాహన కల్పించారు. త్రిబుల్ రైడింగ్ వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ద్విచక్రవాహనంపై ఇరువురు మాత్రమే ప్రయాణించాలని చెప్పారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి అన్ని పత్రాలు ఉండాలని చెప్పారు.

తొక్కిసలాటకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



పార్టీశ్రేణులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో చందోలు గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం వచ్చిన 18నెలల కాలంలో ఇప్పటికి సుమారు దేవాలయాల వద్ద మూడు తొక్కిసలాట సంఘటనలు చోటు చేసుకున్నాయని, 23 మందికిపైగా మృతి చెందటం బాధాకరమైన విషయమని కోన పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న దేవాలయాల వద్ద పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

శ్రద్ధతో అర్జీలను పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను శ్రద్ధతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన పంట నష్ట వివరాలను వెంటనే అందజేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన బాధితులకు నగదు, బియ్యం పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు. తుఫాన్ ప్రభావం వల్ల దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొల్లూరు మండలం అనంత గ్రామానికి చెందిన రైతులు విత్తనాల కంపెనీల వారి మాటలు నమ్మి నకిలీ విత్తనాలు వేశామని వరి పంట దిగుబడి కోల్పోయామని జాయింట్ కలెక్టర్‌కు అర్జీ అందజేసి న్యాయం చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ రేపల్లె ఆర్డీవోను విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 1వ తేదీన భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా 95 శాతం పెన్షన్లు పంపిణీ చేసిన బాపట్ల మున్సిపాలిటి సచివాలయ సిబ్బందిని అభినందించి డ్రైవర్స్ కాలనీ సచివాలయ సిబ్బంది చిమటా వెన్నెలను జేసీ అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ లవన్న, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు రెండు ఫిర్యాదులు

రేపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదికను పట్టణంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరుకుపల్లి మండలం రాజవోలుకు చెందిన తాతా నాగబాబు తన భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా కోరారు. పట్టణానికి చెందిన షేక్ ఇస్మాయిల్ మొంథా తుఫాన్ కారణంగా చెట్టు కూలి శ్లాబ్ బద్దలైందని, ప్రహరీ కూలి నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.

వైభవంగా శ్రీరామలింగేశ్వరస్వామి శతాబ్ది ఉత్సవాలు



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న ఆకెళ్ళ విభీషణశర్మ

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీగంగాపర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి శతాబ్ది ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, రుద్రశత చండీహోమం ప్రారంభమైంది. వినాయకస్వామి వారికి లక్ష ఉండ్రాళ్ళ పూజ, 500 మంది మహిళలచే కోటికుంకుమార్చన జరిగింది. తాళ్ళపాక మణికంఠ శివాచార్యస్వామి యాజ్ఞికపర్యవేక్షణలో ఆలయ అర్చకులు ప్రసాదస్వామి, చిట్టిబాబు, సాయివెంకట్, కౌండిన్య, హనుమంతరావు, అర్చక సహకారంతో ఆలయ ధర్మకర్తలు ఆదూరి హరినారాయణ, కర్లపాలెం నాగేంద్ర, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. టీటీడీ ఆస్థాన ప్రవచన కర్త అకెళ్ళ విభీషణచారిచే ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది.



500 మంది మహిళలచే కోటి కుంకుమార్చన చేస్తున్న చిత్రం

కార్తిక సోమవారం దేవాలయాలలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నడింపల్లి శిఖరేశ్వరస్వామి

చెరుకుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తికమాసం రెండో సోమవారం మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము 3 గంటల నుండే మహిళలు దేవాలయాలలో 108 హారతులు వెలిగించి పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీ లింగోద్భవస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీలింగోద్భవస్వామి

పిట్టలవానిపాలెం,నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారని త్రిముఖ దేవాలయాలకు చెందిన ఆలయాల కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు ఆలయంలో 300 ఒత్తులతో దీపారాధనలు వెలిగించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. ఆలయపాలకమండలి ఛైర్మన్ పరిమి రామకృష్ణసాయిబాబు పర్యవేక్షణలో ఆలయ సిబ్బందితో కలిసి అర్చకస్వామి దండిభొట్ల సాంబమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు, విద్యార్థులు

వాతావరణ కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన

కర్లపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, పర్యావరణ, వాతావరణ కాలుష్యం గురించి పాఠశాల విద్యారులకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు యారంవారిపాలెం అయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు గర్భిణులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. స్కూల్ విద్యార్థులకు ఆరోగ్య విద్యనందించారు. తుఫాన్ తర్వాత వచ్చే అసంక్రమిత వ్యాధుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పర్యవేక్షణాధికారి డాక్టర్ లోకేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఎన్.మల్లికార్జునరావు, జిల్లా మేనేజర్ ఎస్.లక్ష్మణ్, ఈసాకు, ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆషాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణ, ఆసక్తి విజయానికి మొదటి మెట్టు : పిన్నిబోయిన

కర్లపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రేరణ, ఆసక్తి విజయానికి మొదటి మెట్టు అని మానసిక నిపుణులు పిన్నిబోయిన శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం కర్లపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.విజయశ్రీ అధ్యక్షతన విద్యార్థినీ, విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు అద్భుతమైన శక్తి సామర్థ్యాలను, సాంకేతిక నైపుణ్యత కలిగి ఉన్నప్పటికి అవసరమైన వ్యాపకాలతో శక్తి సామర్థ్యాలను సాంకేతికను మరుగునపడేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు, రాజేష్, ఉదయ్, ఎం.వీరజ్యోతి, ఫ్రాన్సిస్, భవానిదేవి, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో జోరుగా జరుగుతున్న దొంగతనాలు



సీసీ కెమెరాలో రికార్డు అయిన బైక్ దొంగ

చెరుకుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గతనెల రోజుల నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా మండలంలో దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గత నెల రోజులలో రెండు దేవాల యాలలో హుండీల దొంగతనం, రెండు బైక్‌ల దొంగతనం, పట్టపగలు యువకుడి జేబులోని మొబైల్ ఫోన్ చోరీ జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం చెరుకుపల్లిలో ఆర్యవైశ్య భోజన హోటల్ యజమాని ఎండూరి సుధాకర్ తన స్కూటీని హోటల్ వెనుక పార్క్ చేయగా హోటల్లో భోజనం చేయడానికి వచ్చిన దొంగ అక్కడ ఎవరూ లేకపోవడం చూసి స్కూటీని చోరీ చేశాడు. హోటల్ యజమాని సీసీ కెమెరా పరిశీలించగా విషయం అవగతమై వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వరుస చోరీలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ పెంచాలని, ఇలాంటి సంఘటనలపై కఠిన వైఖరి అవలంబించాలని ప్రజలు కోరుతున్నారు.

జంపని హైస్కూల్‌లో వృత్తి విద్యా లేబోరేటరీ ప్రారంభం

వేమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు బదరీ నారాయణ వృత్తి విద్యా లేబోరేటరీ విభాగాన్ని ప్రారంభించారు. సమగ్ర శిక్షా యోజన ఆదేశాల మేరకు పాఠశాల స్థాయిలో వృత్తి విద్యపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ట్రేడ్ నుంచి ఒక గ్రూపు, ఎలక్ట్రానిక్స్ నుంచి మరో గ్రూపు పాల్గొని తమ ప్రతిభతో తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొన్న రెండు గ్రూపులను ఈ నెల 7వ తేదీ జిల్లా స్థాయిలో జరుగుతున్న ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రకటించారు. కార్యక్రమంలో ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు భాగ్యమ్మ, నరసింహారావు, మధుమయి, ప్రకాష్, పార్థసారథి, శాంతిశ్రీ, అనిత, సత్యవతి, రాంబాబు పాల్గొన్నారు.



ఎలక్ట్రానిక్స్ పరికరాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రామేశ్వరాలయ మహాద్వారం ప్రారంభం

వేమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని రామేశ్వరాలయం తూర్పు దిక్కున భక్తుల సహాయ సహకారాలతో మహాద్వార నిర్మాణం చేశారు. శైవ ఆగమ పండితులు బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయ శర్మ పర్యవేక్షణలో ఆలయ వాస్తు రీత్యా శివపార్వతుల దర్శనంతో కూడిన శిల్పాల ద్వారా పాలకులను మహాద్వారం వద్ద అతి సుందరంగా శిల్పులు తీర్చిదిద్దారు. వైఖానస ఆగమ పండితులు కేంద్ర ప్రభుత్వం పండిత సత్కార గ్రహీత శ్రీమాన్ దీవి లక్ష్మీనరసింహాచార్యులు చేతుల మీదుగా సోమవారం రాత్రి మహాద్వారాన్ని ప్రారంభించారు. అర్చక బృందం వేదమంత్రాల భక్తుల శివనామ స్మరణ నడుమ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భజన సంఘాల వారు విశేష భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాఫ్ట్‌బాల్ బాలికల జట్టుకు ఎంపికైన భట్టిప్రోలు విద్యార్థిని

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాఫ్ట్‌బాల్ బాలికల జట్టుకు తమ విద్యార్థిని ఎంపికైనట్లు టీఎం రావు హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 1న అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలికల జట్టుకు జరిగిన క్రీడాకారుల ఎంపికలో తమ పాఠశాల విద్యార్థిని పులివర్తి వందన ఎంపికైందన్నారు. ఈనెల 22న వైఎస్ఆర్ కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికకు ఉమ్మడి జిల్లా తరుపున పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారిణికి శిక్షణ ఇచ్చిన పీఈటీ మహ్మద్ అనూల్ హక్, చేబ్రోలు శ్రీనివాసరావులను కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ సుగుణకుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

భూసార ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

కర్లపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భూమి ఆరోగ్యం, భూసార ప్రాముఖ్యతను గురించి ప్రధానోపాధ్యాయురాలు బి.సుగణమణి విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని యాజలి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు 7, 8, 9వ తరగతి విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్-2025పైన మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష, వాటి ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమంత్ పాల్గొని భూ ఆరోగ్యం, పోషకాల లభ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్ ఎన్.ఇస్సాకు, రజిత, వ్యవసాయ ఉపాధ్యాయులు సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



భూసార ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న బి.సుగణమణి, వ్యవసాయాధికారులు

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

● మంత్రి అనగాని సత్యప్రసాద్



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎవరూ వైద్యఖర్చులనిమిత్తం అప్పులుపాలుకాకుండా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సకాలంలో నిధులు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్నారని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని 23 మంది బాధితులకు సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 23 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.64లక్షల 32వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. 15 నెలల్లో సుపరిపాలనతో అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి కోట్ల రూపాయల మేర సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనన్నారు. ఈ కార్యక్రమంలో కొలసాని రాము, దేవగిరి రవి పాల్గొన్నారు.



పంట నష్టం నమోదు చేయకపోవడంపై ఏవోను ప్రశ్నిస్తున్న మురళీకృష్ణ, రైతులు

పంట నష్టం నమోదులో తాత్సారం

● సమీక్షలో 7 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని అంచనా

● మండలం మొత్తం 500 ఎకరాల్లో మాత్రమే పంట దెబ్బతిందంటున్న ఏవో

● ఏవోపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుల డిమాండ్

కొల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టం నమోదును వ్యవసాయ అధికారులు తాత్సారం చేస్తున్నారని సోమవారం గడువు ముగుస్తున్న మీనమేషాలు లెక్కించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లూరు మండలం యాదవపాలెం, బొద్దులూరుపాడు గ్రామాల పరిధిలో ఇటీవల మొంథా తుఫాన్ తీవ్రతకు వరి పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట నష్టం అంచనాలు వేసేందుకు వ్యవసాయ సిబ్బంది యాప్‌లో ఆయా వివరాలు నమోదు చేయవద్దంటూ మండల వ్యవసాయాధికారి నరేంద్రబాబు ఫోన్‌లో సందేశాలు పంపించి నమోదు ప్రక్రియను ఆపి వేయించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మండల టీడీపీ అధ్యక్షులు ఝైనేని మురళీకృష్ణ దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించిన ఆయన రైతులతో రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. ఏడీఏ లక్ష్మీ గ్రామంలో ఉన్న సహాయ వ్యవసాయాధికారితో పంట నష్టం నమోదు చేయించుకోవాలని ఫోన్‌లో రైతులకు సూచించారు. తుఫాన్ సమయంలో ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏడు వేల ఎకరాలలో పంట దెబ్బతిందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా ఎలా వేశారని, ఇప్పుడు కేవలం 500 ఎకరాల్లోనే వరి పంట దెబ్బతిందని చెప్పడం ఏమిటని రైతులు వ్యవసాయాధికారులను నిలదీస్తున్నారు. అంతలోనే వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన ఏవోను ఝైనేనితో పాటు రైతులు దీనిపై ప్రశ్నించగా తాను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరమే పంట నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఝైనేని మాట్లాడుతూ, ఏవో పని తీరు బాగా లేదని, ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు చూస్తుంటే ఇలాంటి అధికారులు రైతులను ఇబ్బంది పెడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని, ఏవోపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతావన్నారు.

నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన సంస్థపై చర్యలు తీసుకోవాలి

● జేసీకి వినతి పత్రం అందించిన రైతు సంఘం నాయకులు

కొల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన ఎన్నారై అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు జాయింట్ కలెక్టర్ భావనకు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన రైతులు తమకు జరిగిన నష్టంపై న్యాయం చేయాలని కోరుతూ బాపట్లలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ఒక్కో ఎకరాకు రూ.50 వేల నష్టం వాటిల్లిందని, ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతులకు న్యాయం జరగని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి టి.కృష్ణమోహన్, నాయకులు సుబ్బారావు, రైతులు ధూళిపాళ్ల రవి, జాలాది ధనుంజయరావు, నాగళ్ల కృష్ణారావు, సతీష్, రత్నబాబు, అశ్విన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నకిలీ విత్తన కంకులతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన బాధిత రైతులు

తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

చుండూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల జనసేన అధ్యక్షుడు, మున్నంగివారిపాలెం సర్పంచ్ శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కౌలుదారులు, రైతులతో కలిసి తహసీల్దార్ నాగరాజుకి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ, మండలంలో నాలుగు వేల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. నష్టపోయిన వారిలో ఎక్కువ మంది కౌలుదారులు ఉన్నారు. రూ.50 వేలకు పైగా పెట్టుబడులు, కౌలు చెల్లింపులు జరిగాయి. ఇంతవరకు వ్యవసాయ శాఖ అధికారులు గాని రెవెన్యూ అధికారులు గాని కనీసం పంట నష్ట అంచనాలు కూడా సేకరించడానికి గ్రామాల్లోకి రావడం లేదన్నారు. ప్రభుత్వం కౌలుదారులను, పేద రైతులను నష్టాల నుంచి గట్టెక్కించాలని శ్రీరామమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలుదారులు గూడపాటి శ్రీనివాసరావు, గోపి, తన్నీరు రాముడు, అప్పికట్ల తాతారావు, చేబ్రోలు బోడియ్య తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు బంగారు, వెండి ఆభరణాలు బహూకరణ



పార్వతీ అమ్మవారికి బంగారు గాజులు, వెండి పట్టీలు అందజేస్తున్న దాత పోతురాజు దంపతులు

కొల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనంత భోగేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లకు దాతలు బంగారు, వెండి ఆభరణాలు బహూకరించారు. సోమవారం కొల్లూరులో ఈనాడు రెస్టారెంట్ యజమాని యరగళ్ల పోతురాజు దంపతులు స్వామి వారికి రూ.40 వేలు విలువ కలిగిన వెండి మారేడు దళాలు, పార్వతీ అమ్మవారికి 9 గ్రాముల బంగారు గాజులు, వెండి పట్టీలు, రూ.60 వేలు విలువ కలిగిన ఆభరణాలను అర్చకులు కొమ్మూరి వెంకటశివప్రసాద్, గాడేపల్లి శివశర్మలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆభరణాలకు విశేష పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు అర్చకులు అలంకరించారు.

ఖరీఫ్ కష్టం.. రబీ జాప్యం

● వ్యవసాయంపై తీవ్ర ప్రభావం ● చూపిన మొంథా తుఫాన్
● కీలక సమయంలో దెబ్బతీసిన భారీవర్షాలు

మొంథా తుఫాన్ జిల్లాలో వ్యవసాయ రంగంపై తీవ్రప్రభావం చూపింది. కీలక సమయంలో తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను దెబ్బతీయడమే కాక రబీ పంటల సాగుకు ఆలస్యం కానుంది.



ఉప్పుగుండూరు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు (ఫైల్)

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వ్యవసాయంపై తీవ్రంగా ఉంది. ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతినగా, రబీ సాగు బాగా ఆలస్యం కానుంది. జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ సీజన్‌గా అక్టోబరు నుంచి రబీ సీజన్‌గా పరిణిస్తారు. జిల్లాలో అక్టోబరు తొలిపక్షంలో వేసే పంటలను కూడా ఖరీఫ్ సీజన్‌గానే లెక్కిస్తున్నారు ఖరీఫ్‌లో జిల్లాలో వ్యవ సాయ శాఖ పరిధిలో లక్షా 29వేల హెక్టార్లలో వివిధ పంటల సాగు చేస్తారు. అలాగే ఉద్యాన శాఖ పరిధిలో మరో 20వేల హెక్టార్లలో మిర్చి, కూరగాయలు ఇతరత్రా సాగు చేస్తారు. ఈ ఏడాది దాదాపు లక్షా 24వేల హెక్టార్లలో వ్యవ సాయశాఖ పరిధిలోని పంటలు, 15వేల హెక్టార్లలో ఉద్యానశాఖ పరిధిలో పంటలు వేశారు. ప్రధానంగా కంది, పత్తి, వరి, సజ్జ, మొక్కజొన్న, బర్లీ పొగాకు, మిర్చి తదితరాలు సాగు చేశారు. ఆ పంటలు పూత, పిందె, కోత దశలకు అధికభాగం చేరగా కొంత విస్తీర్ణంలో ఎదుగుదల దశలో ఉన్నాయి.

అక్టోబరు నెల కీలకం

అక్టోబరు నెల ఖరీఫ్ పంటలకు కీలక సమయం. మరోవైపు రబీ పంటలు అత్యధిక భాగం అక్టోబరు, నవంబరు నెలల్లో వేస్తారు. పశ్చిమ ప్రాంతంలో పొగాకు, శనగ అధికభాగం అక్టోబరులోనే సాగు చేస్తారు. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో నవంబరు, డిసెంబరులలో వాటి సాగు చేపడతారు. అక్టోబరు, నవంబరుల్లో అన్ని ప్రాంతాల్లోనూ వరినాట్లు వేస్తారు. అలా అక్టోబరు రబీ పంటల సాగుకు కీలకం. ఇలాంటి సమయంలో ఒక్కసారిగా తుఫాన్ విరుచుకుపడి జిల్లాను ముంచెత్తింది. కేవలం 36 గంటల వ్యవధిలో జిల్లాలో 18.40 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

నష్ట అంచనాల్లో అధికారులు

జిల్లాలో అక్టోబరులో సాధారణ వర్షపాతం 20.57 సెం.మీ కాగా ఏకంగా 49.96 సెం.మీ కురిసింది. పొన్నలూరు మండలంలో 25.02 సెం.మీ సాధారణ వర్షపాతం అయితే అక్కడ దాదాపు 70 సెం.మీ నమోదైంది. సంతనూతలపాడు, పీసీపల్లి పామూరు, ఒంగోలు, మర్రిపూడి, కొత్తపట్నం, కొండపి, కనిగిరి, చీమకుర్తి, సీఎస్.పురం, మద్దిపాడు, ఎన్‌జీపాడు, పొదిలి, సింగరాయకొండ, టంగుటూరు తదితర మండలాల్లో 40 నుంచి 65సెం.మీ వరకు కురిసింది. మిగతా మండలాల్లోనూ 30 నుంచి 40సెం.మీ పడింది. ఇలా సాధారణం కన్నా పలుచోట్ల అధికంగా ఈ నెలలో కురవడం, అందులోనూ తుఫాన్ సమయంలో భారీవర్షాలు ముంచెత్తడంతో పొలంలో ఉన్న ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతిన్నాయి. దాదాపు 40 వేల హెక్టార్లలో పత్తి, మిర్చి, సజ్జ, కంది, వరి, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. ఇంచుమించు 15వేల హెక్టార్లలో ఆ పంటలకు పూర్తిగా నష్టం జరిగినట్లు అధికార వర్గాలు అంచనా వేసి రైతువారీ నష్టాలపై ఎన్యుమ రేషన్ చేస్తున్నారు.

బురదమయంగా భూములు

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలు చేతికొచ్చే అవకాశం లేదు. నీటిలో రెండు మూడు రోజులు ఉన్న ఇతర విస్తీర్ణంలోని పంటలు కోలుకుంటున్నప్పటికీ ఆ పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గి రైతులు భారీగా నష్టపోనున్నారు. మరోవైపు తుఫాన్ వల్ల కురిసిన భారీవర్షాల ప్రభావం రబీ సాగుపైనా తీవ్రంగా చూపనుంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో శనగ, పొగాకు, మిర్చి వంటి పంటలను అక్టోబరులో ముమ్మరంగా వేస్తారు. అలాగే తూర్పు ప్రాంతం లో కాస్తంత ఆలస్యంగా వేసే ఆ పంటలకు భూములు సిద్ధం చేసే పని ఆ సమయంలో జోరుగా సాగుతుంది. అయితే అక్టోబరు 20 నుంచి వర్షాలు ప్రారంభమై తుఫాన్ సమయంలో ముంచెత్తడంతో పొలాల్లో భారీగా వర్షపు నీరు పారి బురదమయంగా మారాయి. అవి పూర్తిగా ఆరి సేద్యం చేస్తే తప్ప పంటలు వేసే అవకాశం లేదు.





భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవార పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచే స్థానిక శివాలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి కార్తీకదీపాలను వెలిగించి, పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం అక్కడి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, సంతపేట సాయిబాబా మందిరంలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన మొదలైన కార్యక్రమాలు జరిగాయి. సోమవారం సాయంత్రం సైతం మహిళలు కార్తీక దీపారాధనలలో పాల్గొన్నారు.

బండ్లమూడిలో రణరంగం

చీమకుర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన వివాదం చినికిచినికి గాలివానలా మారి దాడులకు దారితీసింది. కానిస్టేబుల్ వారిస్తున్నా సరే ఎస్సీలపై మరోవర్గం కర్రలతో దాడి చేసింది. ఈ ఘటన సోమవారం మండలంలోని బండ్లమూడి గ్రామ నడిబొడ్డున చోటుచేసుకుంది. సీఐ దాసరి ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్.సుబ్బారెడ్డికి చెందిన గొర్రెలు ఇదే గ్రామ ఎస్సీకాలనీకి చెందిన కంట్లం ఏసుదాసు, ఎలీసమ్మ, రామయ్యలకు చెందిన సరుగుడు పొలంలో పడటంతో పంట నష్టం జరిగింది. ఈ విషయమై నిలదీయడానికి పొలం యజమానులైన ఎస్సీలు సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ వాగ్వాదం చోటుచేసుకోవడంతో నష్ట పరిహారం చెల్లిస్తామని సుబ్బారెడ్డి ఒప్పుకున్నాడు. దానికి అంగీకరించని పొలం యజమానులు చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గ్రామానికి వచ్చి బస్టాండ్ సెంటర్‌లో విచారణ ప్రారంభించారు. అదేసమయంలో పొలం యజమానులు, మరికొంత మంది తమ బంధువులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీలు సామాజికవర్గం మొత్తాన్ని కలిపి మాట్లాడుతున్నారంటూ కొందరు అడ్డుకున్నారు. 'మా ఇళ్ల మీదకే వచ్చి దౌర్జన్యం చేస్తారా..' అంటూ అక్కడే ఉన్న కొంతమంది కర్రలతో ఎస్సీలపై ఒక్కసారిగా దాడికి దిగారు. మధ్యలో హెడ్ కానిస్టేబుల్ సర్ది చెబుతున్నా వినిపించుకోలేదు. దీంతో బండ్లమూడి బస్టాండ్ సెంటర్ రణరంగంగా మారింది. ఈ ఘటనలో ఎస్సీలు కంట్లం రామయ్య, ఏసుదాసు, ఏసేపు, మరో మహిళకు గాయాలయ్యాయి. వారిని బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



బండ్లమూడిలో దాడి చేస్తున్న వారిని వారిస్తున్న కానిస్టేబుల్

ఇదే ఘటనలో గోపి రెడ్డి బాలఓబుల్ రెడ్డి, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరూ వైద్యంనిమిత్తం ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై కంట్ల ఏసుదాసు ఫిర్యాదు మేరకు వనిపెంట శ్రీనివాసరెడ్డి, బాలఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అదే విధంగా ఓబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురు ఎస్సీలపై కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాద్ కేసు విచారిస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

చెంచు గిరిజనులను ఆదుకోండి

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన చెంచు గిరిజనులను ఆదుకోవాలని రాష్ట్ర చెంచు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ నాయకుడు అంకారావు కోరారు. ఈ మేరకు శ్రీశైలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రాజెక్ట్ అధికారి వెంకటశివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మొంథా తుఫాన్‌తో గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాలోని పలు గిరిజన గూడేలలో ఇళ్లు దెబ్బతిన్నాయని, కొందరికి పంట నష్టం జరిగిందని వాటిపై విచారణ జరిపించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

నిశీధిలో మృత్యుఘోష

(5వ పేజీ తరువాయి)

అత్తయ్య, వియ్యపురాలు గాదె రాజు పుష్పవతి(60), మనవడు జయంత్, మనవరాలు వైష్ణవి, బంధువు ముదునూరి శ్రీనివాసరాజు (57) ఉన్నారు. శ్రీనివాసరాజు కారు డ్రైవింగ్ చేస్తున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో కర్లపాలెం పంచాయతీ సత్యవతిపేట వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయి వారి కారు ఎదురుగా వస్తున్న రొయ్యల కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బలరామరాజు, లక్ష్మీ, పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసరాజు కొన ఊపిరితో హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందారు. చిన్నారి వైష్ణవికి కుడి భుజానికి గాయాలు కాగా చీరాలలోని ప్రైవేట్ వైద్యశాలకు, జయంత్ తల, కాళ్లకు గాయాలు కాగా గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన మూడు నిమిషాల్లోనే మిగిలిన రెండు కార్లు ఘటనా స్థలానికి చేరుకోవడంతో.. బంధువులు బోరున విలపిస్తూ మృత దేహాలను వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై సీఐ హరికృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సీసీఐ ఇంకాస్త 'మెత్తబడాలి'!

(5వ పేజీ తరువాయి)

సీసీఐ బయ్యర్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల రైతులు పత్తిని ఎంత ఆరబెట్టినా అదే తేమ శాతం నమోదు కావడం గమనించదగిన అంశం. ఈ పరిస్థితుల్లో తేమ శాతాన్ని 12 నుంచి 20కి పెంచాలని రైతులు కోరుతున్నారు. ఈ మాత్రం వెసులుబాటు ఇవ్వకపోతే తాము పూర్తిగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పని చేయని కిసాన్ యాప్

సీసీఐ అందుబాటులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ సరిగా పనిచేయక పోవడం రైతులకు శాపంగా మారింది. స్లాట్ బుక్ చేసుకోవడం గగనం అయిపోతుందని రైతులు చెబుతున్నారు. సీసీఐ అధికారులు మాత్రం అదే యాప్ ను వాడాలని చెబుతున్నారు.

జీఓ నంబరు 843కి తిలోదకాలు

రాష్ట్రంలోని పత్తి రైతులకు మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 843కి సీసీఐ తిలోదకాలు ఇచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ జీవోలని 23వ నిబంధన ప్రకారం రైతు పత్తిని ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు ఉంది. సీసీఐ మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. ఏ జిల్లా రైతులు అదే జిల్లాలో, ఏ మండలం రైతులు అదే మండలంలో పత్తిని విక్రాయించాలని సూచిస్తోంది. జీఓను కూడా గుంటూరు లోని సీసీఐ జనరల్ మేనేజర్ పక్కన పెట్టడం దుమారం రేపుతోంది.

ఆర్టీసీ కార్గో డెలివరీ కౌంటర్ ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్గో పార్శిల్ విభాగం డెలివరీ కౌంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఆర్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో సీనియర్ ముఠామేస్త్రి జె.తిరుపతయ్య దీనిని ప్రారంభించారు. పార్శిల్ డెలివరీ కోసం వచ్చే కస్టమర్లు ఇక నుంచి ప్రకాశం హాస్పిటల్ రోడ్ ద్వారా డెలివరీ కౌంటర్లకు చేరుకుని వారి పార్శిల్‌ను, ఎల్ఆర్ నెంబరు డెలివరీ కోడ్ తెలపడం ద్వారా కౌంటర్ల నుంచి పొందవచ్చని తెలిపారు.

చిత్రజ్యోతి
SINCE 1965

కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్ర్కిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి

అవీ..ఇవీ..

7నుంచి చెస్, 23 నుంచి యోగా పోటీలు

పంగులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు చెస్, 23 నుండి 25 వరకు యోగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్. జిల్లా కార్యదర్శి కె.ప్రతిమ తెలిపారు. ఎస్‌జీఎఫ్ 69వ జిల్లాస్థాయి చెస్, యోగా పోటీలు ఒంగోలులో ముగిశాయన్నారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలు మన్యం జిల్లా జోగంపేటలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలు 23 నుంచి 25 వరకు బాపట్ల జిల్లా, జే.పంగులూరు మండలం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని కార్యదర్శి ప్రతిమ, పీడీ మధుమూర్తి తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

పంగులూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమూరు గ్రామ పొలాలలో మొంథా తుఫాన్‌కు కుప్పకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సిబ్బంది సోమవారం పునర్నిర్మించారు. తీవ్ర తుఫాన్ కారణంగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ పడిపోవడంతో వ్యవసాయ పంప్‌సెట్లకు సరఫరా నిలిచింది. సమస్యను గుర్తించిన విద్యుత్ ఏఈ ఆంజనేయులు తన సిబ్బందితో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ పునర్నిర్మాణం చేపట్టారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించిన సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జన జాతీయ జాగారణ దివస్


జాగరణ దివస్ వేడుకల్లో ఉపాధ్యాయులు

వాడరేవు (చీరాల), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జనజాతీయ జాగారణ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధులు, జానపద గాయకులు బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రత్న కుమారి ఆధ్వర్యంలో గిరిజన గోడ చిత్రకళ, వార్లీ గోండ్ చిత్రాలు తయారీ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మార్టూరులో జ్వాలా తోరణం

మార్టూరు,నవంబరు3(ఆంధ్రజ్యోతి):కార్తీక పౌర్ణమి సందర్భంగా జాతీయ రహదారి పక్కన ఉన్న మార్టూరులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు ఎస్ మృత్యుంజయశాస్త్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం అనంతరం మాలధారులకు భిక్ష, భక్తులకు అన్నదానం చేయనున్నారని తెలిపారు. కార్యక్రమానికి అయ్యప్ప స్వామి మాలధారులు, భవాని స్వాములు శివస్వాములు తదితర భక్తులు హాజరై, స్వామి వారి కార్యక్రమాన్ని తిలకించాలని ఆయన కోరారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

పంగులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ఈ నెల 26న పాల్గొనే అవకాశం పంగులూరు మండల విద్యార్థులకు దక్కింది. రాజ్యాంగదినోత్సవం కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాల పరిధిలో జరిగిన పోటీలలో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థి యాస్మిన్ ప్రథమస్థానంలో నిలువగా, కొంమంజులూరు విద్యార్థిని జపన్యకు ద్వితీయ స్థానం దక్కింది. 26న జరిగే మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రతిభచాటి అద్దంకి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించే అవకాశం అందిపుచ్చుకున్న యాస్మిన్, జపన్యలను ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు సోమవారం అభినందించారు.

ముగిసిన క్విజ్ పోటీలు

చీరాల : రాజ్యాంగ దినోత్సవ నియోజకవర్గస్థాయి క్విజ్ పోటీలు మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రమాదేవీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ఈ నెల 24న అమరావతిలో నమూనా అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి శిక్షణ ఇస్తారని చెప్పారు. అనంతరం అక్కడ కూడా ప్రతిభ కనబరచిన వారికి ఈ నెల 26 నుంచి నమూనా అసెంబ్లీ పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్


వరిపైరును పరిశీలిస్తున్న కరణం వెంకటేష్

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలో నీట మునిగిన వరి, వేరుశనగ పంట పొలాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భారీ తుఫాన్ కారణంగా రైతన్నల పరిస్థితి దయనీయంగా ఉందని, వెంటనే రైతుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

విశ్వజననీ అవార్డు గ్రహీతకు సన్మానం


పర్చూరులో ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశ్వజననీ అవార్డు గ్రహీత పర్చూరు ఎంఈవో-2 అల్లూరి శివ కోటేశ్వరరావుకు సోమవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. విద్యా రంగంలో అందించిన సేవకు గుర్తింపుగా ఆయనకు అవార్డు దక్కడం హర్షణీయం అని ఎంఈవో -2 ఎంవీ.వెంకట్రామయ్య అన్నారు. ఒక సాధారణ ఉపాధ్యాయునిగా ప్రభుత్వ కొలువులో అడుగు పెట్టి రాష్ట్రస్థాయిలో అవార్డు పొందడం విద్యాశాఖకే గర్వ కారణం అన్నారు. అనంతరం శివకోటేశ్వరావును దుశ్శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

- ఉదయాన్నే శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్న మహిళలు


అద్దంకిలోని కమతేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చినగంజాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమశివుని మదినిండా కొలిచారు. స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. చినగంజాం గంగాపార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాలను భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రాలు, ఆలయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపారాధనలు చేశారు. ఆలయాలు కార్తీక దీపాల వెలుగులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

అద్దంకి : కార్తీక సోమవారం పూజలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాల గుడి, కమతేశ్వరాలయం తదితర శివాలయాలలో కార్తీక సోమవారం సందర్భంగా మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. మణికేశ్వరంలోని మల్లేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించు కున్నారు. వరదల నేపథ్యంలో గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేయకుండా మణికేశ్వరం వద్ద స్నానాల ఘాట్‌ను దేవాలయం ఈవో గుంటుపల్లి వాసుబాబు మూసి వేయించారు. ఏర్పాట్లను సీఐ సుబ్బరాజు పరిశీలించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తీక సోమవార పూజలు

పర్చూరు : కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. వేకువ జామునుండే పెద్దఎత్తున భక్తులు చేరుకొని ఆలయాల్లో కార్తీకదీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు, ఉప్పుటూరు శివాలయం, చెరుకూరు, తదితర ఆలయాల్లో విశిష్ట పూజా కార్యక్రమాలు దీపోత్సవం చేపట్టారు. కార్తీక సోములు చేసుకునే భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, వ్రతకార్యక్రమం చేపట్టారు.

మార్టూరు : శివాలయాల్లో భక్తులు సందడిగా కనిపించారు. ముఖ్యంగా మహిళలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మార్టూరులో నేతాజీనగర్ సమీపంలోని ఘట్టేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం సమీపంలో ఏర్పాటుచేసిన ఘట్టేశ్వరస్వామికి భక్తులు అభిషేకం చేసి, అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. జాతీయరహదారి పక్కన ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరుడ్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అదేవిదంగా అయ్యప్ప, భవాని మాలధారులు, ఇంకా వివిధ మాల ధారులు కూడా వేకువజాము నుంచి దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడంతో,దేవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి వాతావరణం ఏర్పడింది.





చినగంజాంలోని రామకోటేశ్వరస్వామి, పర్చూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, మార్టూరులోని ఘట్టేశ్వరస్వామి, మణికేశ్వరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ

రబీ పంటలను సాగు చేయగానే నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

యద్దనపూడి, (మార్టూరు)నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రబీలో పంట సాగు చేయగానే పంటల నమోదు చేయించుకోవాలని ఏవో కుమారి అన్నారు. సోమవారం యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల్లో 33 శాతంకన్న ఎక్కువగానే నష్టపోవడంతో, ప్రభుత్వానికి నివేదికను పంపించామన్నారు. మండలంలో డ్వాక్రా గ్రూపులను రాష్ట్ర ప్రభుత్వం నిర్దయించిన లక్ష్యాలకు, చేరువయ్యే దిశగా 134 రైతు ఉత్పత్తిదారులసంఘాలను ఏర్పాటుచేశామని వెలుగు ఏపీఎం వెంకటరావు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెల రోజుల వ్యవధిలో 2 నార్మల్ డెలివరీ లను చేశామని, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యాధికారి హర్ష సమావేశంలో చెప్పారు. మండలంలో 8 గ్రామాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య తెలిపారు. మండలంలో బాల్యవివాహాలు జరగకుండా ఉండేందుకు అందరూ సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర ప్రజా ప్రతినిదులను, అధికారులను కోరారు అంతేగాకుండా సంతానం లేని దంపతులు పిల్లలను దత్తత తీసుకోవడానికి బాపట్ల కేంద్రంలో సంప్రదించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా ఇంటిపన్నులను చెల్లించాలన్నారు. గ్రామస్థులు ఎక్కడ నుంచైనా, ఇంటి పన్నును చెల్లించే అవకాశం ఉందని ఈవోఆర్డీ కృష్ణ అన్నారు. పశుపోషకులకు 75 శాతం రాయతీతో జొన్న విత్తనాలను పంపిణీచేస్తామన్నారు. ఒక్కొక్కరికి 5 కిలోలు జొన్నవిత్తనాలను అందచేస్తామని పూనూరు పశువైద్యాధికారి తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో షేక్ మహమ్మద్ అఖీబ్ జావెద్, విద్యుత్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక పారిశుధ్యం వంతు


మురుగు నీటితో అధ్వానంగా ఈపూరుపాలెంలో ఓ వీధి

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వర్షపు నీరు దాదాపుగా తొలగింది. పాలకులు, అధికారులు చాలావరకు తుఫాన్ నీటిని తొలగించే పనిలో కొంత వరకు సఫలీకృతులయ్యారు. అయితే కొన్నిచోట్ల నీరు తొలగించాల్సి ఉంది. ఈక్రమంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామాల్లో వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై వీధులు, స్కూల్ గ్రౌండ్‌లు, నివాసాలు అధ్వానంగా మారాయి. ఆయా సమీపాల్లో దుర్వాసనలు, దుర్గంధాలు వెదజల్లుతున్నాయి. దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలు లేని కారణంగా గతంలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఈనేపద్యంలో దీనికి వర్షపు నీటి మురుగు ఏకం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు. లేకుంటే రోగాలు ప్రభలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.


ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ మైదానం

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్లు జైలు

మేదరమెట్ల నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):హత్యాయత్నం కేసులు నిందితుడికి ఏడేళ్లు జైలు శిక్ష, 10000 జరిమానా విధిస్తూ అద్దంకి కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకట నాగలక్ష్మి సోమవారం తీర్పు ఇచ్చారు. కొరిసపాడు ఎస్సై సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిసపాడు మండలం కృష్ణంరాజు వారి పాలెం గ్రామానికి చెందిన మోదుగుల సోమిరెడ్డి అదే గ్రామానికి చెందిన భవనం చిన్నారెడ్డిని 2020 మే నెలలో దాడి చేసి గాయపరిచాడు. చిన్నారెడ్డి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు పంపించారు. ఆ కేసుకు సంబంధించి తుదితిర్పు సోమవారం వచ్చింది. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరల డిఎస్పి మోయిన్ ఆధ్వర్యంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ సురేష్ బాబు, కోర్టు కానిస్టేబుల్ ఆనంద్ కేసు దర్యాప్తు వేగంగా చేసి నిందితుడికి శిక్షపడేలా కృషి చేశారు. అప్పట్లో కేసు నమోదు చేసిన ఎస్ఐ మల్లికార్జునరావు ప్రస్తుతం కంభం సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. సాక్ష్యాలు సేకరించడంతోపాటు, నిందితుడిని డిమాండ్ కు పంపించడంలో కృషిచేసిన మల్లికార్జున ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పొలం వివాదంలో మహిళపై పలువురు దాడి

- మార్టూరు నుంచి కారులో వచ్చి దాడిచేసినట్లు బాధితురాలి ఆవేదన

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పొలం వివాదంలో మహిళపై పలువురు దాడిచేయగా బాధితురాలు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు పర్చూరు మండలం చెరుకూరుకు చెందిన బుర్ల వెంకాయమ్మకు మార్టూరుకు చెందిన ఎలగాల సాయి, నాగలక్ష్మీ, కోటేశ్వరమ్మ, నాగేంద్రమ్మలకు గతకొంత కాలంగా పొలం వివాదం ఉంది. వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉండగా, సోమవారం ప్రత్యర్థులైన నలుగురు కారులో మార్టూరు నుండి ఇంటికి వచ్చి ఒంటరిగా ఉన్న వెంకాయమ్మపై దాడిచేసి గాయపరిచి వెళ్లి పోయారు. బంధువుల సహకారంతో ప్రస్తుతం బాధితురాలు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


విజేతలను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు

అద్దంకి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ పోటీలలో భాగంగా సోమవారం నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వ్యాసరచన పోటీల నుంచి ముగ్గురిని, వక్తృత్వ పోటీల నుండి ముగ్గురిని ఎంపిక చేసి ఆరుగురు కి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమస్థానాన్ని పంగులూరు మండలం బూదవాడ హైస్కూల్ విద్యార్థిని యాస్మిన్, ద్వితీయస్థానాన్ని కొండమంజులూరు హైస్కూల్ విద్యార్థి జపన్య, తృతీయస్థానం బల్లికురవ మండలం పెద అంబడిపూడి హైస్కూల్ విద్యార్థిని గీతికామాధురి సాధించారు. ముగ్గురుని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతున్నారు. కార్యక్రమంలో అద్దంకి, పంగులూరు, బల్లికురవ ఎంఈవోలు కేవీ.శ్రీనివాసరావు, వీరాంజనేయులు, రమేష్, హెచ్‌ఎంలు శ్రీనివాసమూర్తి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, బుచ్చిబాబు, లక్కరాజు సుజాలు పాల్గొన్నారు. విజేతలను అభినందించారు.

గుండ్లకమ్మలో దూకిన వ్యక్తి మృతదేహం గుర్తింపు


నాగబ్రహ్మారావు (ఫైల్)

అద్దంకి/మద్దిపాడు,నవంబరు3(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మాచాబత్తుని వెంకట నాగబ్రహ్మారావు(61) మృతదేహం మద్దిపాడు మండలం నందిపాడు సమీపంలో లభించింది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన నాగబ్రహ్మారావు కెనరాబ్యాంక్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉండడంతో మతిస్థిమితం కోల్పోయాడు.. గత నెల 30న మెడికల్ షాపుకు అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జిపై నుంచి దూకే సమయంలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మూడు రోజుల పాటు పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది గుండ్లకమ్మ నదిలో గాలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నాగబ్రహ్మారావు మృతదేహం గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు దాటి దిగువకు పోయి నందిపాడు సమీపం లో చిల్లచెట్ల మధ్య ఇరుక్కుంది. నందిపాడు గ్రామస్థులు మృతదేహాన్ని గుర్తించి మద్దిపాడు పోలీ సులకు సమాచారం అందించారు. విషయం తెలుసు కున్న అద్దంకి పోలీసులు, బంధువులు నందిపాడు వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి నాగ బ్రహ్మా రావుదిగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు

- కోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత
- సర్వేలో ఆర్అండ్‌బీ స్థలంగా గుర్తింపు


కొలతలు వేస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

అద్దంకి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో భవనాసి కాలువ సమీపంలో వైసీపీ నేత గూడా శ్రీనివాసరెడ్డి గోడౌన్ నిర్మించారు. అనధికారిక కట్టడంగా గుర్తించిన మున్సిపల్ అధికారులు యజమాని శ్రీనివాసరెడ్డికి నోటీసులు ఇచ్చారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులపై శ్రీనివాసరెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు సోమవారం మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఓపెన్ సర్వే నిర్వహించారు. సర్వేలో శ్రీనివాసరెడ్డి నిర్మించిన గోడౌన్‌తో పాటు సమీప ప్రాంతంలో సుమారు 80 సెంట్లు ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమించడం, అందులో కొంతమేర నిర్మాణాలు జరిగినట్లు తేలినట్లు మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి లక్ష్మి తెలిపారు. వెనుక వైపు స్థలంలో మున్సిపల్ అనుమతులు తీసుకొని ముందువైపు ఆర్అండ్‌బీ స్థలంలో గోడౌన్ నిర్మాణం చేసినట్లు సర్వేలో తేలిందని లక్ష్మీ తెలిపారు. అయితే జిల్లా సర్వేయర్ ద్వారా మరోసారి సర్వే చేయించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

కార్తీక స్నానాలకు అనుమతి నిరాకరణ

వాడరేవు(చీరాల), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రామాపురం, వాడరేవు ప్రాంతాల్లో కార్తీక మాసస్నానాలకు భక్తులకు బుధవారం వరకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. అధికారులు సోమవారం తీరంలో పర్యటించి పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చారు. తుఫాన్ ప్రభావంతో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే భక్తులకు, పర్యాటకులకు అనుమతులు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

కాలువలో పడి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపాలెం భవానీపురానికి చెందిన మీసాల ఉమా(32) మార్కెట్ సమీపంలో కలువపూల విక్రయాలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే దండుబాట రోడ్డు నుంచి స్వర్ణ వెళ్లే మార్గంలోని కాలువలో పూలు కోసేందుకు దిగి ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గౌడ అన్నదాన సత్రానికి నిధులు కేటాయించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అద్దంకి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలో గౌడ సామాజిక అన్నదాన సత్రం భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని గౌడ సంఘం నేతలు సోమవారం గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలను సోమవారం అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంపని రామచంద్రరావు, బలగాని ఆంజనేయులు, రాఘవ, రామాంజనేయులు, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాత దర్శి రోడ్డులో నివాసం ఉండే 16 నిరుపేద కుటుంబాలకు ముద్దపాటి శ్రీనివాసరావు సహకారంతో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, అళహరి హరిప్రసాద్, చప్పిడి వీరయ్య, పూటుకూరి రామకోటేశ్వరరావు, లేవిప్రసాద్, మహ్మద్‌రఫీ, అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో విద్యుత్ టవర్ల నిర్మాణ పనుల నేపథ్యంలో మంగళవారం రాజీవ్‌కాలనీ, మధురానగర్, బిక్షాలు కాలనీ, ఒంగోలు రోడ్డు తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ దామోదరం తెలిపారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.